ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

కుత్బుల్లాపూర్: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది బలమైన ఆయుధమని, ఓటు చోరీ కాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు శనివారం గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లో నిర్వహించిన ఓటు చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయితో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, వాసు, శ్రీనివాస్ రెడ్డి, అంజి, ప్రసాద్, నరేష్ గౌడ్, ఉషారాణి, సుజాత గార్ల పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి



కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధికి కృషి చేయాలని బీఆర్ఎస్ సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ అన్నారు. మస్తానా బిల్డర్ అసోసియేషన్ కాలనీ నూతన కమిటీ సభ్యులు అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం భాస్కర్‌ను కలిశారు. నూతన కమిటీని ఆయన సన్మానించారు. కాలనీ అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వికాస్, హితేష్ వర్మ, ప్రభు కిరణ్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

పూజలు.. అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయి కాలనీలో అభయాంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు



దుండిగల్: ఇంటి ముందు కూర్చున్న ఓ వృద్ధుడిపై వీధికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట ప్రాంతానికి చెందిన వెంకట్‌రెడ్డి శనివారం ఉదయం ఇంటి ముందు కూర్చున్నాడు. అదే సమయంలో గుంపుగా వచ్చిన వీధి కుక్కలు ఒక్కసారిగా వెంకట్‌రెడ్డిపై దాడి చేశాయి. స్థానికులు అప్రమత్తమై కుక్కలను తరిమి కొట్టారు. వీధి కుక్కల బెడదపై ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వృద్ధుడికి శస్త్ర చికిత్స చేయించి వెంటనే కుక్కలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

కుంగిన డ్రెయిన్ నాలా మూత

రంగారెడ్డినగర్: వరదనీరు సాఫీగా వెళ్లేందుకు నిర్మించిన డ్రెయిన్ నాలాలపై మూత నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీ ప్రధాన రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో డ్రెయిన్ నాలా మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన మూత కుంగిపోయింది. దీంతో రాత్రి వేళల్లో కుంగిన ప్రాంతాన్ని గమనించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి కుంగిన మూతను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



నేడు పల్స్ పోలియో



ఏఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ అధికారులు

- నియోజకవర్గంలో 105 బూత్‌లు, 420 మంది సిబ్బంది
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

దుండిగల్: పోలియో మహమ్మారిని భూస్థాపితం చేసే బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా ఇప్పటికే వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పోలియో చుక్కలు వేసే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీలు, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో ఆదివారం పుట్టిన చిన్నారుల దగ్గర నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లల వరకు పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

76,670 మంది పిల్లలకు..

నియోజకవర్గంలో 0–5 సంవత్సరాలలోపు పిల్లలు మొత్తం 76,670 ఉండగా అందులో సర్కిల్‌లో 41,307, మున్సిపాలిటీల్లో 35,363 ఉన్నారు. మొత్తం 105 బూత్‌లను ఏర్పాటు చేయగా 10 రూట్ సూపర్‌వైజర్లను, మూడు మొబైల్ టీంలను నియమించారు. ఇప్పటికే పల్స్ పోలియో వాయిల్స్‌ను అందుబాటులో ఉంచారు. మొత్తం 105 బూత్‌ల్లో ఒక్కో బూత్‌కు నలుగురు సిబ్బంది చొప్పున 420 మంది పని చేస్తారు. పిల్లల పేర్లు నమోదు చేసుకోవడంతో పాటు వారికి సిరా గుర్తు వేసేందుకు ఒకరు, పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు మరొకరు, సహాయంగా మరో ఇద్దరు ఉంటారు. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎంఎన్‌లు, ఆశా వర్కర్లు, ఇతర వాలంటర్లు విధులు నిర్వహించనున్నారు.

తప్పకుండా చుక్కలు వేయించాలి



పోలియో రహిత సమాజం కోసం అందరు కృషి చేయాలి. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పని సరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి. ఇప్పటికే ఇంటింటికి తిరిగి చిన్నారుల వివరాలను సేకరించాం. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించాం. చిన్నారులకు సరిపడా వాయిల్స్‌ను అందుబాటులో ఉంచాం. వంద శాతం చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తాం.

– డాక్టర్ స్వర్ణలత, మండల వైద్యాధికారిణి

ఇంటింటికీ వెళ్లి..

ఆదివారం ఏర్పాటు చేసిన ఆయా బూత్‌ల వద్ద పోలీయో చుక్కలు వేసిన అనంతరం సోమ, మంగళ వారాల్లో ఇతర ప్రాంతాల్లో సిబ్బంది పర్యటిస్తారు. దుండిగల్, డి.పోచంపల్లి, గాగిల్లాపూర్ ప్రాంతాల్లోని ఇటుక బట్టీలు, కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లోని గుడిసెల వద్దకు మొబైల్ టీమ్‌లు స్వయంగా వెళ్లి పల్స్ పోలియో చుక్కలు వేయనున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే బస్తీబాట

మేడ్చల్ సీఈ కామేష్



సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న మేడ్చల్ సీఈ కామేష్

కుత్బుల్లాపూర్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే బస్తీబాట కొనసాగుతుందని మేడ్చల్ సీఈ కామేష్ అన్నారు. కొంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని దూలపల్లి ప్రధాన రోడ్డులో శనివారం బస్తీ బాట నిర్వహించారు. గడిచిన సంవత్సర కాలంలో కొంపల్లి సెక్షన్ పరిధిలో 30 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 11 కేవీ విద్యుత్ లైన్ రెండు ప్రాంతాల్లో వేసినట్లు తెలిపారు. 30 సంవత్సరాల క్రితం వేసిన లైన్ శిథిలావస్థకు చేరడంతో ఉమామహేశ్వర కాలనీ మేరకు ఎల్‌టీ లైన్ సుమారు మూడు కిలోమీటర్లు కొత్తగా వేసినట్లు వివరించారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 8 ఎంఏ లైన్‌లను తొలగించి 12.5 లైన్లను ఏర్పాటు చేశామన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించే దిశగా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎస్ఈ రవికుమార్, డీఈ రాజు జాన్, కుత్బుల్లాపూర్ ఏడీఈ శ్రీకాంత్, కొంపల్లి ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎత్తు పెంచితే కాలనీలు జలమయం



సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్ : ప్రణాళిక లేకుండా సీసీ రోడ్ల ఎత్తు పెంచితే మూడు కాలనీలు నీట మునిగే ప్రమాదం ఉందని బీజేపీ కార్పొరేషన్ 18వ వార్డు ఇన్‌చార్జి శీలం కృష్ణారెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును బీజేపీ బాచుపల్లి అధ్యక్షులు ఎస్.ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రణాళిక లేకుండా ఎత్తు పెంచి రోడ్డు వేయడం వల్ల మూడు కాలనీలో 100కు పైగా అపార్టుమెంట్‌లు భారీ వర్షాలు కురిసినప్పుడు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు మారుతున్నారుగానీ శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడంలేదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి, నాయకులు అజయ్ కుమార్, దాసి నాగరాజు, రచ్చ చక్రధర్, పద్మ ప్రసాద్, గజ్జెల్లి సంతోష్, ఉదయ్ కిరణ్, అశోక్ నాయక్, బీజేవైఎం నాయకులు సాయిరామ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సమాజ స్థాపనలో భాగస్వాములవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరిచందన

- హైదరాబాద్ కలెక్టర్ హరిచందన
- సెయింట్ మార్టిన్స్ కళాశాలలో కమ్యూనిటీ టాక్

సుభాష్‌నగర్: యువత చెడు వ్యసనాలకు దూరమై మెరుగైన సమాజ స్థాపనలో భాగస్వాములవ్వాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కమ్యూనిటీ టాక్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సివిల్ సర్వీసెస్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు అంకితభావం, అభిరుచితో సివిల్స్ పరీక్షకు సిద్ధం కావాలని సూచించారు. సివిల్ సర్వీస్ కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేయడానికి ఓ గొప్ప అవకాశమన్నారు. విద్యార్థులతో తను అనుభవాలను పంచుకున్న కలెక్టర్ వారితో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కేవైడీఈ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రమణ కురుహూరి, కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్ర శేఖర్‌యాదవ్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, డీన్ రామకృష్ణరాజు, డాక్టర్ రణధీర్ రెడ్డి, డాక్టర్ ఎస్.రామచంద్ర, డాక్టర్ రాకేశ్, హెచ్‌ఓడీలు గౌతమ్, సురేష్, ఆర్.చిన్నారావు, డాక్టర్ కృష్ణయ్య అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల బస్తీ బాట

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో శనివారం విద్యుత్ శాఖ అధికారులు బస్తీబాట నిర్వహించారు. జేఎల్ఎం సురేష్ ఆధ్వర్యంలో లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి తదితరులు గల్లీల్లో తిరుగుతూ స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. లో ఓల్టేజీ, వీధి దీపాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిరంజన్, ప్రవీణ్, ప్రేమ్ కుమార్‌యాదవ్, కుమార్ గౌడ్, సూర్యనారాయణ, సాయి కుమార్, తులసి, రవి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతపై బైక్ ర్యాలీ

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహ్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్, రోడ్డు సేఫ్టీ క్లబ్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ.. బైక్‌ర్యాలీ నిర్వహించారు. 'హెల్మెట్ ధరించండి.. ప్రాణాన్ని రక్షించుకోండి'.. 'డ్రైవ్ సేఫ్.. స్టే సేఫ్' అంటూ నినాదాలు చేశారు. ప్రాణ రక్షణలో హెల్మెట్ ముఖ్యమని వివరించారు. సుమారు 250 మంది విద్యార్థులతో నారపల్లి, చౌదరిగూడ ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది. కళాశాల డైరెక్టర్ డా.సీవీ.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు సతీష్‌కుమార్, కృష్ణ, వివిధ విభాగాల డీన్లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.



మేడ్చల్ పట్టణ డీసీసీ భవన్‌లో శనివారం జాతీయ కాంగ్రెస్ నాయకురాలు అంజలి నింబాల్కర్‌ను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

– కుత్బుల్లాపూర్

రుణ లక్ష్యం పెంపు !

- 2,612 మహిళా సంఘాలకు రూ.197 కోట్ల రుణాలు
- ఇప్పటి వరకు 1,230 గ్రూపులకు రూ.85 కోట్లు అందజేత



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తున్నాయి. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన సభ్యులు వివిధ రకాల కుటీర పరిశ్రమలు, వ్యాపారాలు చేస్తూ.. కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా 2,612 మహిళా సంఘాలకు రూ.197 కోట్ల మేరకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ లక్ష్యం పెట్టుకోగా.. ఇప్పటి వరకు రూ.85 కోట్ల రుణాలను మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాన్ని అధిగమించి మహిళా సంఘాలకు రుణాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో లక్ష్యాన్ని పూర్తి చేయడం ద్వారా రాష్ట్రంలో మేడ్చల్–మల్కాజిగిరి మొదటి నుంచి ఐదు స్థానాల లోపు ర్యాంకును సాధించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రుణాలను పెద్ద మొత్తంలో అందజేసి, గతంలో మాదిరిగా తెలంగాణలో మొదటి నుంచి ఐదు స్థానాల లోపు సాధించటానికి ప్రయత్నిస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ పేర్కొంటోంది.

- జిల్లాలోని ఘట్‌కేసర్ మండల పరిధిలో 281 సంఘాలకు రూ.22.28 కోట్లు , కీసర మండలంలో 236 సంఘాలకు రూ.16.21 కోట్లు, మేడ్చల్ మండలంలో 289 సంఘాలకు రూ.17.67 కోట్లు, ఎంసీపల్లిలో 208 సంఘాలకు రూ.11.36 కోట్లు, శామీర్‌పేట మండలంలో 216 మహిళా సంఘాలకు రూ.18.32 కోట్లు బ్యాంకు లింకేజీ కింద రుణాలు అందజేశారు.

స్త్రీనిధి రుణాలు కూడా..

- స్త్రీనిధి కింద మహిళా సంఘాల కుటుంబసభ్యుల అవసరాల నిమిత్తం రుణాలను మంజూరు చేస్తున్నారు. ప్రధానంగా వ్యవసాయం, పిల్లల చదువు, ఆరోగ్యం, ఇతర చిన్న చిన్న ఉపాధి వ్యాపారాలకు ఈ రుణాలను మహిళా సంఘాలు వినియోగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే స్త్రీనిధి కింద జిల్లాలో గతేడాది కంటే అదనంగా రుణాలు అందజేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకుసాగుతోంది.

లక్ష్యానికి మించి రుణాలు

జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.అలాగే, స్త్రీనిధి కింద కూడా రుణాలు అందజేస్తాం. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న సభ్యులు ప్రతి నెల క్రమ తప్పకుండా కిస్తులు చెల్లించాలి.

– సాంబశివరావు, జిల్లా అధికారి గ్రామీణ అభివృద్ధి సంస్థ

భద్రతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు

డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ వై.మోహన్‌బాబు



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ మోహన్‌బాబు

జీడిమెట్ల: రాష్ట్రంలో నడుస్తున్న ప్రతి పరిశ్రమ కార్మికుల కోసం భద్రతా ప్రమాణాలు పాటించాలని, విస్మరిస్తే చర్యలు తప్పవని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ వై.మోహన్‌బాబు అన్నారు. శనివారం జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో పరిశ్రమ ఉద్యోగులకు ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు తప్పనిసరిగా ముందుగానే శిక్షణ పొంది ఉండాలని తెలిపారు. కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్ (సీఈపీ) వ్యవస్థాపకులు తపస్‌సాహా మాట్లాడుతూ.. నాడు చిన్న వాట్సాప్ గ్రూప్‌గా ప్రారంభమైన ఈ సంస్థ నేడు వేలమందితో నడుస్తుందన్నారు. నిత్యం పరిశ్రమలలో ఎదుర్కొనే సమస్యల పట్ల శిక్షణా తరగతులు నిర్వహిస్తూ పారిశ్రామిక రంగంలో ప్రతి ఉద్యోగికి శిక్షణ లభించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అరబిందో అండ్ అపిటోరియా ఫార్మా ఈహెచ్ఎస్ జనరల్ మేనేజర్ అమర్‌కుదాలే, బీఎస్ అండ్ బిసెఫ్టీ సిస్టమ్స్ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.జయ, శంకర్, గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఈహెచ్ఎస్ వైస్ ప్రెసిడెంట్ మెట్లపల్లి శ్రీనివాస్, సందీప్‌కుమార్, డా.శాంసన్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన వివిధ పరిశ్రమల ఉద్యోగులు

పరామర్శ.. ఆర్థికసాయం



దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి చర్చి గాగిల్లాపూర్‌లో నివసిస్తున్న మైనారిటీ యువతికి ఇటీవల మెదడులో రక్తం గడ్డకట్టింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో యువతి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొంగునూరి కిషోర్‌రెడ్డిని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ ద్వారా వైద్యం చేయించారు. సర్జరీ అనంతరం ఇంటి వద్ద యువతిని శనివారం పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ధైర్యం చెప్పడంతో పాటు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కావలి గణేష్, శ్రీశైలం ముదిరాజ్, దొంతి మహేష్, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- దుకాణ ఏర్పాటుకు స్థల హక్కుదారుని ఆమోదపత్రం కూడా అవసరం
- 'సాక్షి'తో కూకట్‌పల్లి ఎస్ఎఫ్ఓ తోట జగన్మోహన్



తోట జగన్మోహన్

ఇంటర్వ్యూ

కేపీహెచ్‌బీకాలనీ: బాణాసంచా దుకాణాల ఏర్పాటుదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అగ్నిమాపక శాఖ కూకట్‌పల్లి ఫైర్‌స్టేషన్ అధికారి (ఎస్ఎఫ్ఓ) తోట జగన్మోహన్ స్పష్టం చేశారు. ముఖ్యంగా దుకాణాలు ఎక్కడైతే ఏర్పాటు చేస్తారో ఆ స్థల సంబంధిత వ్యక్తుల ఆమోద పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ ప్రభుత్వ విభాగాలకు చెందిన స్థలంలో ఏర్పాటు చేస్తున్నట్లైతే సంబంధిత విభాగం నుంచి ఎన్‌ఓసీ పత్రాన్ని తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దుకాణదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమ నిబంధనలకు సంబంధించి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

ప్రశ్న: టపాసుల దుకాణాల అనుమతి కోసం ఎవరిని సంప్రదించాలి?

ఎస్ఎఫ్ఓ : టీఎస్ ఫైర్.కామ్ వెబ్‌సైట్‌లోకి వెళ్ళి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా తాము విచారణ జరిపి తదనుగుణంగా అనుమతులకు సంబంధించిన లైసెన్స్ జారీ చేస్తాం.

ప్రశ్న: టపాసుల దుకాణదారులు ఏ విధమైన నిబంధనలు పాటించాలి?

ఎస్ఎఫ్ఓ: టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసేవారు ముందుగా స్థల యజమాని నుంచి గానీ, సంబంధిత హక్కుదారుని నుంచి గానీ తమకు అభ్యంతరం లేదని పేర్కొంటూ ఓ పత్రాన్ని అందజేయాలి. ఖాళీ ప్రాంతంలోనే దుకాణాల ఏర్పాటు చేయాలి. ఒకవేళ షాపులో విక్రయాలు కొనసాగించాలనుకుంటే షాపు మాత్రమే సింగిల్‌గా ఉండాలి. షాపునకు షాపునకు మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. జీఐ జింక్ షీట్లతోనే టపాసుల విక్రయశాలలను నిర్మించుకోవాల్సి ఉంటుంది.

ప్రశ్న: దుకాణాల నిర్వాహకులు ఏవిధమైన జాగ్రత్తలు పాటించాలి?

ఎస్ఎఫ్ఓ : టపాసుల దుకాణాల వద్ద మంటలను ఆర్పే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి. స్మోకింగ్‌కు ఆస్కారం ఇవ్వకుండా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలి. డ్రమ్ముల్లో నీటితో పాటు ఇసుక బక్కెట్‌లను ఉంచాలి. ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ మాత్రమే ఉపయోగించాలి. దుకాణానికి వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి. 18 ఏళ్ల లోపు వారిని పనిలో పెట్టుకోకూడదు. షాపుల వద్ద చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి. టపాసుల దుకాణంలో నిరంతరం పర్యవేక్షించేలా ఓ వ్యక్తిని నియమించుకోవాలి.

ప్రశ్న: దీపావళి పండుగ జరుపుకునే గృహనివాసితులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఎస్ఎఫ్ఓ: ఇంట్లో బాణాసంచాను విడిగా, ఇతర మండే పదార్థాలకు దూరంగా ఉంచాలి. బాణాసంచా కాల్చేటప్పుడు వదులుగా ఉండే సిల్క్ దుస్తులు గానీ, సులభంగా అంటుకునే దుస్తులు గానీ ధరించవద్దు. బిగుతుగా ఉండే కాటన్ లేదా త్వరగా అంటుకోకుండా ఉండే దుస్తులను మాత్రమే ధరించాలి. నాణ్యమైన, చట్టబద్ధంగా తయారైన, అనుమతించబడిన మంచి బ్రాండ్ గల బాణాసంచాను కొనుగోలు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. పెద్దల పర్యవేక్షణలో పిల్లలు బాణాసంచాను కాల్చాలి. వారిని ఒంటరిగా బాణాసంచా కాల్చనీయవద్దు. రాకెట్లు, పైకి ప్రయోగించే ఇతర బాణాసంచాలను నిటారుగా ఉంచి పైన చెట్లు గానీ, కరెంటు తీగలు లేవని నిర్ధారించుకుని మాత్రమే వెలిగించాలి.

ప్రశ్న: అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి?

ఫైర్‌ఆఫీసర్: షాపుల వద్ద గానీ, లేదా ఇళ్ల వద్ద టపాసులు కాల్చే సమయంలో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 101కు గానీ, కంట్రోల్ రూమ్ నెంబర్లు 87126 99444/464కు ఫోన్ చేయవచ్చు.